

# సూర్యదేవర రామ్ మోహన రావు

Author of Highest
Number of Novels In Telugu

2 0 2 0
130 వ నవల

విష కన్యలపై
తెలుగు లో
వచ్చిన
మొట్టమొదటి
నవల



# కర్మ

For My eBooks : www.kinige.com

KARMA
(Serialised in 'Swati' weekly - 2019-2020)
By
SURYADEVARA RAMMOHANA RAO
(C) Author

Published by:
SATYAVANI PUBLICATIONS
Machavaram, Vijayawada - 520 004
Phone : 9652488668

First Edition :
2020

Price :
Rs. 180-00

Cover Design :
DURGA RAO

Printers :
SRI CHAITANYA OFFSET PRINTERS
Vijayawada-2

# కర్మ

అడవి దారిలో ఇద్దరు యువకులు నడిచిపోతున్నారు. ఒకడు పొడుగు, ఒకడు పొట్టి.

పొడవుగా వున్న యువకుడి పేరు యతీంద్ర. ఆరడుగుల ఆజానుబాహుడు. వయసు ఇరవై ఏడు లేదా ఇరవై ఎనిమిది మించదు. స్ఫురద్రూపి అని చెప్పలేం. కాని నిమ్మపండు రంగులో అతడి వర్చస్సు చూస్తే ఉన్నత కుటుంబానికి చెందిన వాడని అర్థమవుతుంది.

వంకీల జుత్తు, కోల ముఖం, పెద్దపెద్ద కళ్ళు, విశాల ఫాలభాగం, చప్పిడి బుగ్గలు. ముఖ్యంగా అతడి ముక్కు గ్రద్ద ముక్కులా వంపు తిరిగి ఇట్టే ఆకర్షిస్తుంది. పొడవు మెడ, గొంతుముడి ఎత్తుగా తెలుస్తోంది. విశాలమైన ఛాతీ, సన్నటి నడుం ఎక్సర్సైజ్ బాడీ గావటంతో కండలు తిరిగిన దండలు బలిష్టుడని చాటుతున్నాయి.

అతడి కళ్ళలో ఏదో కసి, ముఖంలో పట్టుదల కన్పిస్తున్నాయి. స్థిరంగా వడివడిగా పడుతున్నాయి అడుగులు. ఏమాశించి అడవిలోకొచ్చాడోగాని అతడి ఛాతీ ఆవేశంతో ఎగసిపడుతోంది.

దక్షిణాది రాష్ట్రాల్లో ఆంధ్రా ప్రాంతానికి చెందిన వాడే యతీంద్ర. ఇక అతడి వెంటవున్న యువకుడి పేరు భీక్యా. చామన ఛాయగా బొద్దుగా వున్నాడు. గుండ్రని ముఖం, చప్పిడి ముక్కు. స్థానిక నాగాజాతి యువకుడతను. అడవిలో ప్రతి అంగుళం క్షణ్ణంగా తెలిసిన గైడు భీక్యా.

యతీంద్ర, భీక్యాలు వెళ్తోంది నాగాలాండ్ ఉత్తర ప్రాంతంలోని అటవీ ప్రాంతం. సాధారణంగా గైడు దారి చూపిస్తూ ముందుకు పోతుంటే అనుసరించాలి. కాని అందుకు భిన్నంగా ఇక్కడ యతీంద్ర ముందుకు పోతుంటే పరుగులాంటి నడకతో అనుసరిస్తున్నాడా నాగాజాతీయుడు భీక్యా.

ఇండియాలో ఉత్తర దక్షిణాది రాష్ట్రాల గురించి తెలిసినంతగా ఈశాన్య తూర్పు రాష్ట్రాలయిన త్రిపుర, నాగాలాండ్, మిజోరం, అరుణాచల్‌ప్రదేశ్, హిమాచల్‌ప్రదేశ్, మేఘాలయ రాష్ట్రాల గురించి చాలామందికి తెలీదనే చెప్పాలి. ఇక్కడి నైసర్గిక స్వరూపంతోబాటు ప్రజల సంస్కృతి ఆచార వ్యవహారాలు మనకి భిన్నంగా ఉండటమే అందుక్కారణం కావచ్చు.

ఒకప్పుడయితే నాగా ఆందోళనకారులు, మిజో తిరుగుబాటు దళాల బెడద అధికంగా ఉండేది. కాల క్రమంలో ఇక్కడి సమస్యలు పరిష్కారమైనప్పటికీ అస్సాంలోని బోడో మిలిటెంట్ల సమస్య ఇప్పటికీ అపరిష్కృతంగానే ఉంది. ఈశాన్య భారతంలోని రాష్ట్రాలన్నీ కూడ అధికభాగం కొండకోనలు, లోయలు, మైదానాలు, వాగువంకలతో కూడిన దట్టమైన అటవీ భూముల్ని కలిగి వున్నాయి. మరీ ముఖ్యంగా నాగాలాండ్ ఉత్తర ప్రాంతమంతా పరిస్థితి యిదే. ఇచట అడవులు ఎంత ప్రశాంతంగా ఉ ంటాయో అంతకంత ప్రమాదభరితాలు.

స్థానికేతరులు ఇక్కడి అడవుల్లోకి పోవాలంటే భయపడతారు. నాగాలాండ్ అంటేనే నాగజాతీయులైన నాగా ప్రజలు నివశించే ప్రాంతమని అర్థం. ఇక్కడ స్థానిక నాగా ఆదివాసీలే కాదు. విషం కక్కే నాగుపాములు

కూడ సంచరిస్తాయి. అనేక సర్పజాతులు, విషకీటకాలు ప్రమాదకరమైన చిన్నచిన్న మృగాలకు ఈ అడవులు ప్రసిద్ధి. బయటి ప్రాంతాల్లో అగుపించని పక్షులు క్రిమికీటకాలు విషజంతువులు ఇక్కడ కన్పిస్తాయి. ఆపైన ఇక్కడి నేల స్వభావం కూడ విచిత్రమైంది. తెలీకుండా కాలుపెడితే ప్రాణాలకు గ్యారంటీ ఉండదు. మాంసాహార మొక్కలు, వృక్షాలు కూడ ఉంటాయంటారు. ఏది హానికరమో, ఏది కాదో బయటివాళ్ళకి అర్థంకాదు.

అటువంటి ప్రమాదాలకు నిలయమైన అడవిదారిలో ఆ యిద్దరూ నడిచిపోతున్నారు. యతీంద్ర ముఖంలో ఇదీ అని చెప్పలేని ఒక మొండితనం స్పష్టంగా కన్పిస్తోంది. ఏ ప్రమాదాలనూ అతడు లెక్కచేసే స్థితిలో లేడు. ఏదో సాధించాలనే తపన, ఒక తీవ్ర మనోవాంఛ అతడ్ని ఉత్తేజపరచి ముందుకు నడిపిస్తోంది. యతీంద్రతోబాటు భీక్యా కూడా హంటింగ్ షూస్ ధరించి వున్నాడు.

“భీక్యా...!” ముందుపోతున్న యతీంద్ర గొంతు గంభీరంగా పిలిచింది.

“చెప్పండి సాబ్” వెనకనుండి అడిగాడు భీక్యా.

“అతనుండేది ఈ ప్రాంతాల్లోనే కదూ?”

“ జీ సాబ్”

“పక్కా”

“మనకి అందిన సమాచారం ప్రకారం... పక్కా సాబ్”

“ఇంకెంత దూరం నడవాలి?”

“ఇంకో గంట నడిస్తే చాలు. మనం గూడెం చేరుకుంటాం”

చేతి వాచీ చూసుకున్నాడు యతీంద్ర.

సాయంత్రం మూడు గంటలు సూచిస్తోంది అది. ఆకాశం మేఘావృతమై వుంది. పొద్దు తెలీటం లేదు. పట్టపగలే అడవిలో చలిగాలి వీస్తోంది. యతీంద్ర నడక వేగం మరింత పెంచాడు. అంతలో–

వెనక వస్తున్న భీక్యా అదిరిపడి ఒక్క దూకులో ముందుకొచ్చి యతీంద్ర చేయిపట్టి “ఆగండి సాబ్” అంటూ ఆపాడు.

"ఏమైంది?" అడిగాడు యతీంద్ర.

"ప్రమాదం... ఒక్క అడుగుకూడ ముందుకెళ్ళొద్దు" అంటూ వెనక్కి లాగాడు భీక్యా

యతీంద్రకు అర్థం కాలేదు.

చుట్టూ చెట్టు చేమలు, మోకాలి ఎత్తున పెరిగిన పచ్చిక మధ్యగా నాటుదారి. ఎక్కడా పురుగు కదిలిన జాడలేదు. మరి ప్రమాదం ఎక్కడుందో అర్థంగాక భీక్యా వంక చూసాడు యతీంద్ర.

వాడు నేలను జాగ్రత్తగా పరిశీలిస్తున్నాడు.

"మీ నాగాలు వీరులని విన్నాను. నువ్వేంటి భయస్తుడివి దొరికావు! ఇక్కడంత ప్రమాదం ఏముందని?" అనడిగాడు అసహనంగా.

భీక్యా తలెత్తి చూసి నవ్వాడు.

వెనక్కి వెళ్ళి పదికిలోల బరువుండే రాయి ఒకటి మోసుకొచ్చి ఎదురుగా పచ్చికమీదకు విసిరాడు. రాయి పచ్చగడ్డి మీద పడింది.

"ఏముందక్కడ?" అనుమానంతో అడిగాడు యతీంద్ర

"మీరే చూడండి సాబ్" అన్నాడు భీక్యా

చూస్తూండగానే ఆ రాయి కొద్దికొద్దిగా దిగబడుతూ కొన్ని క్షణాల్లోనే పూర్తిగా భూమిలోకి అదృశ్యమైంది. పచ్చిక ఎప్పటిలా దగ్గరగా మూసుకుపోయింది. రాయిపడిన గుర్తు కూడ అక్కడ కన్పించలేదు. అది చూడగానే యతీంద్రకు నాలుక తడారిపోయి ఒళ్ళు గగుర్పొడిచింది. తను గుడ్డిగా ముందుకుపోయుంటే ఏమయ్యేదో తలచుకుంటేనే అరచేతులు చెమటలు పట్టేసాయి.

సాధారణంగా నదీతీరాల్లోను, ఇసుక భూముల్లోను వుండే ఊబుల గురించి విన్నాడు. కాని నేలమీద కూడ ఊబులుంటాయని ఇప్పుడే చూస్తున్నాడు.

"ఇక్కడి అటవీ భూముల్లో ఈ నేల ఊబులు చాలా ప్రమాదకరమైనవి సాబ్" చెప్తున్నాడు భీక్యా.

"వీటిలో బురద మరీ చిక్కగా వుండి లోతుకూడ ఎక్కువ. కాలుపడితే తీసుకోవటం కష్టం. ఒడ్డున ఉండి మరో మనిషి లాగటం కూడ సాధ్యంకాదు. అంత బలంగా పట్టి లాగేసుకుంటుంది" అన్నాడు.

"ఇక్కడ ఊబి ఉందని నీకెలా తెలుసు?" షాక్ నుంచి తేరుకుంటూ అడిగాడు యతీంద్ర

"మనకన్నా జంతువులు చాలా తెలివైనవి సాబ్. ప్రమాదాల్ని పసిగట్టడంలో అవి మాస్టర్స్. ఇక్కడ నేలను గమనించండి. మనం వెళ్ళాల్సిన దారి ఇటు కుడి పక్కగా ఉంది. జంతువులు ఊబిని చుట్టి నడవటంచేత పచ్చిక నలిగింది. సుమారు ఇరవై అడుగుల వృత్తంలో చాలా పెద్ద ఊబి ఇది. ఇటు రండి" అంటూ భీక్యా తాము వెళ్ళాల్సిన సరైన దారిలో నడుస్తూండగా అతడ్ని అనుసరించాడు యతీంద్ర.

కాసేపటికి ఒక మైదాన మార్గంలో అడుగుపెట్టారిద్దరూ. ఆ చివర ఎక్కడో ఓ కొండ గుట్ట కన్పిస్తోంది. మైదానంలో మనుషులు నడుస్తున్న గుర్తుగా చాలా దారులు కన్పిస్తున్నాయి. ఆ ప్రాంతమంతటా వికసించిన రంగురంగుల గడ్డిపూలతో తివాసీలా అందంగా కన్పిస్తోంది.

"మనం ఆ కొండ గుట్టను చేరుకోవాలి" వేలెత్తి చూపిస్తూ చెప్పాడు భీక్యా.

యతీంద్ర ఏదో అడగబోతూ ఉలికిపడి ఆడిపోయాడు.

కాలికింద ఏదో పడింది. అది కదులతోంది. నాగు పామా....!

గుండె టకటకా కొట్టుకొంటూండగా వంగి చూసాడు. కుడి పాదం కింద ఉందది. హంటింగ్ షూ దాని నడుం మీద బలంగా అదమటంతో కదల్లేక తలతిప్పి షూని కసిగా కొరికేస్తోంది. అది పాము కాదు. ఏదో ఉడుంలా వుంది. వీపుమీద నీలిరంగు అందులో నల్ల మచ్చలు కన్పిస్తున్నాయి. పొడవు తోకతో అది చూడ్డానికి పెద్దసైజు బల్లిలా వుంది. రెండు కిలోలు మించి బరువుండదు.

దాని కోపం చూస్తున్న యతీంద్రకు ఒళ్ళు మండిపోయిది. వంగి జాగ్రత్తగా దాని పీక పట్టుకుని పైకి లేపాడు.

"ఎంత ధైర్యమే నీకు. నా కాలికింద పడి నన్నే కరవాలని చూస్తావా! నేనేంటో నీకు చెప్తా చూడు" అంటూ చట్టున రివాల్వర్ తీసి పాయింట్ బ్లాంక్‌లో షూట్ చేసాడు. బుల్లెట్ గుండెల్ని చీల్చుకుని అవతలకు పోయింది. వెంటనే ప్రాణం వదిలిందా అమాయకపు జీవి. అంతా చూస్తూనే వున్న భీక్యా జాలిగా చూసాడు.

"అదేంటి సాబ్! అనవసరంగా చంపేసారు. ఇదేమీ హాని చేసే ప్రాణాకాదు" అన్నాడు.

"కావచ్చు. కాని ఇది నామీద తిరగబడింది. నాకు నచ్చలేదు. నా పగ ఎంత తీవ్రంగా ఉంటుందో దీనికి మరో పది జన్మలదాకా గుర్తుండాలి. దీని మాంసం తింటేగాని నా కోపం పగ చల్లారవు. దీన్ని కాల్చు" అన్నాడు యతీంద్ర.

ఆ మాటలకి ఉలికిపడి చూసాడు భీక్యా.

"వద్దు సాబ్. ఇది తినడానికి పనికిరాదు. పారేయండి" అన్నాడు.

"పనికి రాదా...? విషమా?" ముఖం చిట్లించి అడిగాడు యతీంద్ర.

"అంతకన్నా ప్రమాదం సాబ్"

"విషం కన్నా ప్రమాదమా!"

"అవును సాబ్. నా మాట వినండి"

"తింటే ఏమవుతుంది? పిచ్చెక్కుతుందా?"

"మీకు తెలీదు సాబ్. దీని పేరు నాగా ఉడుం. ఉడుం జాతిలో ఇది చాలా అరుదైనది. రెండు వందల సంవత్సరాల క్రితమే నిషేధించబడిన మాంసాహారాల్లో ఇదికూడ ఒకటి"

"అయితే... తింటే ఏమవుతుందో అది చెప్పు"

"కామ ప్రేరణ కలుగుతుంది"

"వ్వాట్...? కామ ప్రేరణా...!"

"అవును సబ్. అది అలాంటిలాంటి ప్రేరణ కాదు. తట్టుకోలేరు. తిన్న మూడు గంటల తర్వాత శరీరానికి భయంకరమైన కామ జ్వరం

సోకుతుంది. అది తగ్గటానికి షుమారు రెండు మండలాలు... అంటే 80 రోజులు  పడుతుంది. అప్పటికే అనర్థాలు ఘోరాలు జరిగిపోతాయి"

"ఎలా? ఇంత చిన్న ప్రాణిని తింటే అనర్థాలు ఘోరాలు ఎలా జరుగుతాయి? కామ ప్రేరణ ఏమిటి? తిన్నవాడు బ్రతికుంటాడా?"

"బ్రతికే ఉంటారు సాబ్. విచక్షణ కోల్పోతారు. వయసుతో పనిలేదు. శరీరంలో ఉప్పొంగే లైంగికవాంఛకి ఆడదయితే చాలు. చెరిచేస్తారు. దారుణమైన మదపిచ్చి మనిషిని ఉన్మాదిని చేస్తుంది. మానవ మృగంగా మారిపోతారు. స్థానికులకు దీని ప్రభావం తెలుసుగాబట్టి ఎవరూ దీన్ని ఆహారంగా తీసుకోరు. దీని జోలికిపోరు. పూర్వకాలంలో రాజులు, చక్రవర్తులు వయసు మీరాక కూడా శృంగార జీవితం అనుభవించాలనుకున్నప్పుడు, వారసుల్ని కనాలనుకున్నప్పుడు ఈ నాగా ఉడుముల కోసం వేటగాళ్ళను అడవుల్లోకి పంపేవారు. మీరేదో ఆశించి ఒక లక్ష్యం కోసం ఇంతదూరం వచ్చారు. దీన్ని తింటే ఆ లక్ష్యానికి దూరమైపోతారు. ఆలోచించండి. సాధారణ ఉడుము మాంసం కూడా వాజీకరణంలా పనిచేస్తుంది. కామోద్దీపన శక్తిని కలిగిస్తుంది. అలాంటప్పుడు అరుదైన నాగా ఉడుం మాంసం తింటే ఇక చెప్పక్కర్లేదు సార్... వయసు మీరిన పురుషులు యవ్వనంలో వున్న అమ్మాయిల్ని పెళ్ళి చేసుకున్నప్పుడు ఉడుం మాంసం తినేవాళ్ళు. ఇది చాలా కాలం క్రితం. కాలక్రమంలో ఉడుం జాతి నశించి పోతోందని దేశవ్యాప్తంగా రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు ఉడుం మాంసాన్ని చట్టపరంగా నిషేధించటమే గాక, తీవ్రమైన నేరంగా పరిగణించటం ప్రారంభమైంది.

దీని మాంసం ఇప్పుడు మీరు తిన్నారంటే మీ దృష్టి, లక్ష్యం, ధ్యేయం అన్నీ కామం చుట్టే తిరుగుతాయి. మరి దేనిమీద మీ దృష్టి ఉండదు. ఇక మీ ఇష్టం!" అన్నాడు భీక్యా భయపడుతూ.

భీక్యా హెచ్చరిక యతీంద్రను కలవరపరిచింది. నమ్మలేనట్టు చూసాడు. "నువ్వు చెప్పేదంతా నిజమేనా?" అనడిగాడు.

"జీ సాబ్. మా కొండదేవత మీద ఆన. నేన్నిజమే చెప్పాను. తర్వాత మీ ఇష్టం" అన్నాడు భీక్యా. అంతే–

చేతిలోవున్న చచ్చిన ఉడుంని గాభరాతో అవతలికి విసిరేసాడు యతీంద్ర. పొరబాటున దాన్ని తినుంటే ఏం జరిగేదో వూహించుకుంటేనే గుండె చెదిరి పోయింది. తను నీతిమంతుడేమీ కాదు.

తనలా మారకూడదు. తనకు తన పగ ముఖ్యం. ప్రతీకారం ముఖ్యం. లక్ష్యం ముఖ్యం. తను సలక్షణంగా ఉంటేనే అది సాధ్యం. తను వెదుకుతున్న మనిషిని ఎలాగయినా ఈరోజు పట్టుకోవాలి. అతన్ని కలిసి తన లక్ష్యాన్ని సాధించాలి.

పట్టుదలతో తిరిగి నడక ఆరంభించాడు యతీంద్ర. కాని పొరబాటున కూడ ముందు నడవలేదు. ఎందుకైన మంచిదని భీక్యాను వెన్నంటి నడిచాడు. క్రమంగా ఇద్దరూ కొండ గుట్టను సమీపించారు.

✳ ✳ ✳ ✳ ✳

నాగా ఆదివాసీలు నివశిస్తూన్న కొండగుట్ట వంద అడుగుల ఎత్తుకు మించదు. కాని కొండచుట్టూ కైవారం రెండు కిలోమీటర్ల వృత్తం ఉండొచ్చు. కొండగుట్ట మైదాన ప్రాంతాన్ని ఆనుకునే ఉంది. ఆ రెంటినీ విడదీస్తూ కొండవాగు ఒకటి ప్రవహిస్తోంది. ఇరవై అడుగుల వెడల్పున ఉన్న ఆ వాగునీరు స్వచ్ఛంగా అద్దంలా మెరుస్తోంది. నడుంలోతు మించదు. నీటి అడుగున ఇసుక తెలుస్తోంది. దాన్నిదాటి మైదానంలోకి పోడానికి వెడల్పాటి చెక్కల వంతెన ఒకటి నిర్మించుకున్నారు నాగాలు. మైదానంలో చెట్టుచేమలు తక్కువేగాని కొండగుట్టను చుట్టి అనేక ఫలవృక్షాలు అరుదైన చెట్లు కన్పిస్తున్నాయి. ఆ చెట్లమీద పక్షిజాతులు అనేకం చిత్రవిచిత్రమైన కూతలతో సందడి చేస్తున్నాయి.

యతీంద్ర, భీక్యాలు ఆ చెక్కల వంతెన వద్దకు చేరుకునే సరికి సాయంత్రం సరిగ్గా అయిదు గంటలయింది సమయం. గుట్టపైన ఎక్కడినుంచో వెదురు గొట్టంతో వూదే ఒకరకమైన వాద్యపరికరం నాదం గాలివాటున శ్రావ్యంగా తమకు ఆహ్వానం పలుకుతున్నట్టు వినవస్తోంది.

ఇద్దరూ వంతెన ఎక్కుతూండగానే ఎడంవైపు కాస్త దూరం నుంచి కిలకిలా నవ్వులు వినవచ్చాయి. తలతిప్పి అటు చూసిన యిద్దరికీ ఆదివాసీ

కన్యలు ఆరుగురు వాగులో జలక్రీడలాడుతూ కన్పించారు. అక్కడికి యాభై గజాల దూరంలోనే వున్నారు వాళ్ళంతా. ఇటే పోటీపడి ఈదుకొస్తున్నారు. వాళ్ళని చూడగానే భీక్యా అదిరిపడ్డాడు.

"సాబ్! అటు చూడకండి. వచ్చేయండి.. నా వెనకే వచ్చేయండి" అని హెచ్చరిస్తూ గబగబా వంతెన దాటేసాడు. కాని యతీంద్ర కాళ్ళు కదలమని మొరాయించి వంతెనమీదే ఆగిపోయాయి.

ఆ కన్యల్ని వీక్షించడానికి యతీంద్రకు రెండు కళ్ళు చాలటం లేదు. నీటిలో పూచిన కలువభామల్లా ఉన్నారంతా. వాళ్ళంతా నాలుగు అయిదడుగుల మధ్య ఎత్తుంటారు. పొట్టి అయితేనేమి చూడ్డానికి భలే పసందుగా వున్నారు. వాళ్ళంతా పోటీపడి ఈదుకొంటూ వంతెనను సమీపిస్తున్నారు. నడుంకి పల్చటి వస్త్రభాగం. అలాగే ఛాతీకి మరో పల్చటివి కట్టుకుని కింద అంచులు వదిలేసారు. దాంతో వాళ్ళు ఈతలు కొడుతుంటే వస్త్రభాగాలు చెదరి స్థానభ్రంశం చెందుతూ వారి నగ్న సౌందర్యాన్ని బహిర్గతం చేస్తున్నాయి. అయినా వాళ్ళది పట్టించుకుంటున్నట్టు లేదు. పరాయి మగాడు వంతెనమీద ఉన్నాడు చూస్తున్నాడన్న ధ్యాసేలేదు సరికదా ఈతకొట్టడం ఆపి నెమ్మదిగా వస్తూ మరీ యతీంద్ర వంక చూస్తున్నారు. అతడి పొడవు శరీరం వాళ్ళని ఆకర్షించి ఉండొచ్చు. వాళ్ళలో ఒక అమ్మాయి మరీ బాగుంది. సోగకళ్ళు. ఆమె నగ్నదేహం మళ్ళీమళ్ళీ చూడాలనిపిస్తోంది. ఆమె ఆశగా తననే గుచ్చి చూడటం మరీ నచ్చింది. వాళ్ళు వంతెనకు అతిసమీపంలోకి వచ్చేసారు.

ఈలోపల వంతెన అవతలికిపోయిన భీక్యా తన వెనక యతీంద్ర రావటంలేదని గమనించాడు. వెంటనే పరుగుపరుగున వచ్చి యతీంద్ర చేయిపట్టుకుని అవతలికి లాక్కుపోయాడు.

"సాబ్! కోరి ప్రమాదాల్ని కొని తెచ్చుకోవద్దు. ప్లీజ్" గుట్టపైకి దారితీస్తూ మరోసారి హెచ్చరించాడు.

"ఇప్పుడేమైంది భీక్యా?" అమాయకంగా అడిగాడు యతీంద్ర

"ఇంకా ఏంకావాలి. ఆ అమ్మాయిల్ని చూడొద్దని చెప్పాగదా"

"అందంగానే వున్నారు. చూస్తే ఏమవుతుంది? శపిస్తారా?" వెటకారంగా అడిగాడు.

"సమస్య అందం గురించో శాపాల గురించో కాదు సాబ్. స్థానిక కట్టుబాట్లు ఆచారాల గురించి"

"అంటే... ఆ అమ్మాయిల్ని చూస్తే చంపేస్తారా?"

"వూహూ... అంతకన్నా ప్రమాదకరం. నా మాట వినండి సాబ్. మీకు చెప్పాలంటే చాలా వుంది. దయచేసి మనక్కావలసిన సమాచారం తెలుసుకుని అవతలికిపోయే వరకు అమ్మాయిల్ని చూడకండి. మౌనంగా రండి. ప్లీజ్"

"ఓకే. ఇంతగా నువ్వు చెప్పాక కాదంటానా. అలాగే పద"

కాసేపట్లోనే ఇద్దరూ–

కొండగుట్టపైకి చేరుకున్నారు.

అదే నాగా ఆదివాసీలు నివశించే గూడెం.

ఎట్టకేలకు గమ్యం చేరుకున్నారిద్దరూ.

అక్కడ చెట్లకింద అక్కడొక్కటి ఇక్కడొకటిగా సుమారు ఓ ముప్ఫై యిళ్ళు కన్పిస్తున్నాయి. విసిరేసినట్టు దూరదూరంగా వున్న ఆ యిళ్ళు ఎవరెవరివో తెలుసుకోవటంకూడ కష్టమే. అన్నీ ఒకే పద్ధతిలో వెదురుకర్రలు చెక్కలతో కట్టిన యిళ్ళు. పైన రెల్లుగడ్డి నేత. యిళ్ళు దగ్గర ఆడ మగ పిల్లా పీచు చాలామంది కన్పిస్తున్నారు. ఎవరూ అయిదడుగుల ఎత్తుకు మించి లేరు. మగాళ్ళకన్నా ఆడాళ్ళే పొట్టిగా వున్నా చూడ్డానికి బాగున్నారు. ఇంచుమించు అరకొర దుస్తులతో అర్ధనగ్నంగానే వున్నారు. వాళ్ళకి పట్టింపులున్నట్టు లేదు.

మేకల్ని మళ్ళిస్తున్న ఒక వ్యక్తిని పిలిచి వాళ్ళ భాషలోనే గూడెం దొర ఇంటి గురించి వాకబు చేసాడు భీక్యా. కుడిపక్క ఒక ఎత్తయిన చెక్కల ఇంటిని చూపించాడు వాడు. భీక్యా, యతీంద్రలు ఆ యింటివైపు నడిచారు.

అక్కడికి వెళ్ళేసరికి నాయకుడు ఇంట్లో లేడు. అతడి కోసం ఎదురుచూస్తూ ఇద్దరు స్థానికులు అరుగుమీద వున్నారు. భీక్యా విషయం

తెలుసుకుని అరుగుమీది ఒక కుర్చీలో కూచొని యతీంద్రను రెండో కుర్చీలో కూచోమన్నాడు. ఎదురుగా నాయకుడు కూచునే ఎత్తయిన కుర్చీ వుంది. దాని వెనకే లోన గదిలోకి మరో గుమ్మం వుంది. లోన ఎవరూ ఉన్నట్టులేదు. యతీంద్రకు ఇదంతా చిరాగ్గానే వుంది. అయినా అవసరం తనది గాబట్టి ఓపిగ్గా కూచున్నాడు.

బయటికెళ్ళిన గూడెం దొర కాసేపటికి తిరిగివచ్చాడు. పొట్టిగా లావుగా వున్నాడు. విచిత్రమైన వేషధారణ. ముందుగా స్థానికులిద్దరితో మాట్లాడి పంపించేసాక వచ్చి తన కుర్చీలో కూచుని భీక్యా వంక చూసి నవ్వాడు.

అప్పటికే మర్యాదపూర్వకంగా లేచి వంగి నమస్కరించి కూచున్నాడు భీక్యా.

“నువ్వు ఇక్కడి వాడివే. అది చూస్తే అర్థమవుతోంది. కాని ఇతను... ఎక్కడి వాడు? ఏ పనిమీద ఇక్కడికొచ్చారు?” అనడిగాడు గూడెం పెద్ద యతీంద్రను చూస్తూ.

యతీంద్రకు తెలుగు భాషతోబాటు హిందీ, ఇంగ్లీషు, ఉర్దూ భాషలు వచ్చు. కాని నాగాలభాష తెలీదు. భీక్యాతో హిందీలోనే మాట్లాడుతున్నాడు. భాషరాదు గాబట్టి ఆ యిద్దరి సంభాషణ వింటూ మౌనంగా కూచున్నాడు యతీంద్ర.

అదే సమయంలో గూడెం దొరకి వెనక డోర్‌లో తళుక్కున మెరిసిందో అమ్మాయి. ఆమె ఎవరో కాదు. వంతెనమీద ఉండగా వాగులో జలకాలాడుతున్న ఆరుగురు యువతుల్లో అందంగా తనను ఆకర్షించిన యువతి. యతీంద్రను చూసి నవ్వింది. భీక్యాకు కనబడని విధంగా గదిలో నిలబడి యతీంద్రకు మాత్రం కనబడేలా వన్నె చిన్నెలు ఆరంభించిందామె. వంటిమీది అరకొర దుస్తులు ఇంకా నీళ్ళు ఓడుతున్నాయి. తడితో ఆమె ఒంటి సొంపులు నిగనిగా మెరుస్తున్నాయి. జుత్తు పొడి బట్టతో తుడుచుకుంటూ కళ్ళతోనే పలకరిస్తోంది. కనీకనిపించకుండా ఆమె ఎద పొంగులు రెండు కొండ శిఖరాల్ని తలపిస్తున్నాయి. యతీంద్ర ఎంత వద్దనుకున్నా మనసు ఆమె వైపు లాగేస్తోంది. ఆమె కళ్ళలో కసి ముఖంలో

ఆశ మతిపోగొడుతున్నాయి. ఒక్క రాత్రి ఆ అమ్మాయితో గడిపితే చాలు జన్మ ధన్యమనుకొంటూ ఆమెనే చూస్తూ కూచున్నాడు. బహుశ నాయకుడి కూతురై ఉండాలి. యతీంద్ర మీద పూర్తిగా మనసుపారేసుకున్నట్టుంది. అందుకే అతడి ఎదురుగానే తడి దుస్తులు వదిలేసి పొడి దుస్తులు మార్చుకుంది. ఈలోపల భీక్యా తమ గురించి నాయకుడికి వివరిస్తున్నాడు.

"దొరా! నా పేరు భీక్యా. ఇక్కడ నాగాలాండ్ వాడినే. టూరిస్ట్ గైడ్‌ని. ఇతని పేరు యతీంద్ర. దక్షిణాదిన ఆంధ్రా ప్రాంతం వాడు. ఈయన ఒక వ్యక్తిని వెదుకుతూ ఇక్కడికొచ్చాడు. ఇతను కలవాల్సిన మనిషి మీ గూడెంలోనిగాని, ఈ పరిసరాల్లోగాని ఈ కాలంలో సంచరిస్తూంటాడని విన్నాం. అతడి జాడ మీకు తెలిసి ఉంటుందని మీ వద్దకొచ్చాం" అంటూ వచ్చిన పని చెప్పాడు.

గూడెం నాయకుడు ఆశ్చర్యంగా ఇద్దర్నీ చూసాడు.

"మీరు ఎవరి గురించి అడుగుతున్నారు?" అనడిగాడు.

"అతను జనకుల ఆదివాసీ సంతతి వాడు. అతని పేరు తాంతియా ధూమ్రె. అంతేగా సాబ్?" అంటూ యతీంద్ర వంక చూసాడు భీక్యా.

అప్పటికి కనుచీకటి వేళవుతోంది. కొన్ని యిళ్ళలో దీపాలు వెలిగిస్తున్నారు.

యతీంద్రకు భీక్యా మాటలు విన్పించటంలేదు. అతడి చూపులు ముందు గదిలోకే ఉన్నాయి. లోన అమ్మాయి దీపం వెలిగించింది. ఆమె ఎక్స్‌పోజింగ్‌ను చూస్తూ మైమరచి ఉన్నాడు యతీంద్ర. అక్కడ ఏం జరుగుతుందో అప్పుడు గమనించి షాకయ్యాడు భీక్యా. తను ఏది చేయొద్దని చెప్పాడో అదే చేస్తున్నాడీ మూర్ఖుడు. ఏం చేయాలి?

"కొంప ముంచే పనులు చేయకండి సాబ్. అటు చూడకండి" అంటూ హిందీలో మరోసారి హెచ్చరించాడు. ఈలోపల నాయకుడు నమ్మలేనట్టు చూస్తూ–

"తాంతియా ధూమ్రె...? మీరు అతడ్ని కలవాలని వచ్చారా?" అనడిగాడు.

"అవును దొరా" బదులిచ్చాడు భీక్యా. కాని–

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Karma**

* * *